


ఎన్టీఆర్‌కి ఘన నివాళి



హిందూపురంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

జిల్లావ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడంతోపాటు రక్తదాన శిబిరాలు, దుస్తులు పంపిణీ, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

సోషలిజంతోనే ప్రజాస్వామ్యం

పెట్టుబడీదారీ వ్యవస్థతో వినాశనమే

కార్పొరేట్, మతతత్వాన్ని వ్యతిరేకిద్దాం

'పెట్టుబడి- ప్రజాస్వామ్యం' సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్


ప్రజల జీవన విధానాన్ని పెట్టుబడిదారీ విధానం నాశనం చేస్తుందని ఇలాంటి పరిస్థితుల్లో సోషలిజంతోనే నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించుకోగలమని వక్తలు పేర్కొన్నారు. లెనిన్ శతవర్ధంతి ముగింపు సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో 'పెట్టుబడి–ప్రజాస్వామ్యం' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సులో ముఖ్యవక్తలుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ లెనిన్ గొప్ప విప్లవ యోధుడని జీవితమంతా సమాజంలో పేదరికం నిర్మూలన కోసం పోరాడారని చెప్పారు. లెనిన్ 54 ఏళ్ల జీవితంలో 37 ఏళ్లు అజ్ఞాతం, జైలు జీవితం గడిపారని జీవితమంతా సమాజం కోసమే జీవించారని తెలిపారు. రష్యా విప్లవం విజయవంతం అయ్యే 4 ఏళ్ల మునుపు కార్మికుని ఇంట్లో ఉంటూ దగ్గరుండి పోరాటాన్ని నడిపారని తెలిపారు. లెనిన్ వంటి గొప్ప విప్లవయోధుడికి కూడా విమర్శలు ఎదురయ్యాయని తెలిపారు. సంక్షోభం ఏర్పడి ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్న సమయంలో సమజాన్ని సొసలిజం వైపు నడిపారని తెలిపారు. పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం పట్ల లెనిన్ కమ్యూనిస్టుల వైఖరిని స్పష్టం చేశారని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యం అందరికి సమానం అని చట్టం అందరి దృష్టిలో సమానం అని చెప్పినా ఆస్తి కలిగిన వర్గాల చేతుల్లో ఆయుధంగానే ఉంటుందని చెప్పారని నేడు అది చూస్తున్నామని తెలిపారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అదనపు సంపాదన కోసం వినాశక మార్గాలను అనుసరించి అన్ని వ్యవస్థలను నాశనం చేస్తుందని చాటారని తెలిపారు. దేశంలో మోదీ పెట్టుబడిదారీ వ్యవస్థకు సరైన ప్రతినిధిగా ఉన్నాడని, మతతత్వ విధానం మరొక ఆయుధం అని అన్నారు. హిట్లర్‌కు ఉన్న కొన్ని లక్షణాలు మోది కలిగి ఉన్నారని తెలిపారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ నియంతృత్వ స్థాయికి చేరుకుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రయివేటు పెట్టుబడిదారులను ప్రోత్సహించి కొద్ది మంది చేతుల్లో పెట్టుబడి కేంద్రీకృతం చేసి పేదరికానికి కారణమౌతుందన్నారు. కావున కార్పొరేట్ మతోన్మాద వ్యవస్థ వ్యతిరేకంగా ఉద్యమించి సొషలిజం వైపు నడిపించడమే లెనిన్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రపంచ రూపురేఖలు మార్చిన గొప్ప విప్లవకారుడు, గొప్ప ప్రజాస్వామిక వాది సమాజానికి దిక్సూచి లెనిన్ అని కొనియాడారు. పెట్టుబడిదారీ వ్యవస్థ కేలం లాభాపేక్ష ఒక్కటే చూస్తుందన్నారు. 400 ఏళ్ల క్రితం వచ్చిన పెట్టుబడిదారీ వ్యవస్థ అనేక వ్యవస్థలను నాశనం చేసిందన్నారు. ప్రపంచానికి సమాజానికి న్యూక్లియర్ అణుబాంబులను పెట్టుబడిదారీ వ్యవస్థ ఇచ్చిందని, నిరుద్యోగం సమస్య సృష్టించిందని, అభివృద్ధి మాటున ప్రకృతిని నాశనం చేసిందని అన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపి నిజమైన ప్రజాస్వామ్యం వ్యవస్థ స్థాపనకు సొసలిజం ఒక్కటే మార్గం అన్నారు. దేశంలో రాష్ట్రంలో కూడా పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతతత్వ విధానాలు అనుసరిస్తున్నారని విమర్శించారు. ఫాసిస్టు శక్తులుగా మారకముందే ప్రజలు చైతన్యంతో ఎదుర్కొవాలంటే సొషలిజం స్థాపించుకోవాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప మాట్లాడుతూ లెనిన్ శత వర్ధంతి సందంర్భంగా సంవత్సర కాలం పాటు సిపిఎం ఆధ్వర్యంలో అనేక చైతన్య కార్యక్రమాలు సదస్సులు నిర్వహించామన్నారు.

వైసిపిలో సంస్థాగత మార్పులు.. ?

పాతనేతల పునరాగమనం జరిగేనా ..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ఉమ్మడి జిల్లాలో ఘోర ఓటమిని చవిచూసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరిగి పార్టీని పునరుత్తేజం చేయడంపై పార్టీ అధిష్టానం దృష్టి సారించినట్టు తెలుస్తోంది అందుకు అనుగుణమైన మార్పులను చేపట్టే యోచనలోనున్నట్టు చర్చ నడుస్తోంది. పాత నేతలను తిరిగి పార్టీలోకి పునరాగమనం చేయించేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. వారిని తీసుకురావడం ద్వారా పునరుత్తేజం చేయవచ్చునని భావిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఈ మేరకు ముందుగా ఇప్పుడున్న సమన్వయకర్తలు అంత యాక్టివ్‌గా లేని చోట దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా శింగనమల నియోజకవర్గంలో సమన్వయకర్తగా వీరాంజినేయులు ఎన్నికల అనంతరం నుంచి కనిపించడం లేదు. ఆర్థికంగా అంతగా లేని ఆయన తిరిగి ఆయన పాత వృత్తిలోకి వెళ్లినట్టు సమాచారం. ఇప్పుడు ఆలూరు సాంబశివారెడ్డే కొంత వరకు చూస్తున్నా అంత యాక్టివ్‌గా కనిపించడం లేదు. దీంతో ఆ నియోజకవర్గంలోకి మాజీ మంత్రి, కాంగ్రెసు నాయకులు డాక్టర్ శైలజనాథ్‌ను వైసిపిలోకి తీసుకునే యోచన నడుస్తోంది ఈ మేరకు ఆయన కూడా మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డిని ఇటీవల కర్నూలులో కలవడం బలాన్ని చేకూరుస్తోంది. వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత



వెంకటరామిరెడ్డితోపాటు, తాడిపత్రి వైసిపి సమన్వకర్త పెద్దారెడ్డి మద్దతు కూడా శైలజనాథ్‌కే ఉన్నట్టు తెలుస్తోంది. ఇక రాయదుర్గానికి సంబంధించి మెట్టుగోవిందరెడ్డి ఉన్నారు. మృదుస్వభావి అయిన ఆయన ఎన్నికల్లో ఓటమి తరువాత నుంచి పెద్దగా యాక్టివ్‌గా లేరు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని తిరిగి వైసిపిలోకి తీసుకునే ఆలోచనలు నడుస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇక రాప్తాడుకు సంబంధించి కూడా మార్పు జరిగే అవకాశముందని పెద్దఎత్తున ప్రచారం నడుస్తోంది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి స్థానంలో మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను తీసుకొస్తే ఎలాగుంటుందని యోచిస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. హిందూపురం సమన్వయకర్త దీపిక, కదిరి సమన్వయకర్త మక్బుల్, పుట్టపర్తి సమన్వయకర్త దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కూడా ఎన్నికల అనంతరం నుంచి పెద్దగా కదలికల్లేవు. మౌనంగా ఉంటూ వస్తున్నారు. ఈ నియోజకవర్గాల్లోనూ కొత్త నాయకత్వాన్ని తీసుకొచ్చే ఆలోచనలు నడుస్తున్నాయి. ఈ మేరకు అనంతపురం జిల్లా నేతల సమావేశంలోనే పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి కూడా వెల్లడించినట్లు సమాచారం. ఎక్కడైతే నియోజకవర్గ సమన్వయకర్తలు యాక్టివ్‌గా లేకపోతే అక్కడ కొత్తవారొస్తారని చెప్పియున్నారు. దీంతో పార్టీలో మార్పులు జరిగే అవకాశాలున్నాయన్న ప్రచారం మరింత జోరుగా సాగుతోంది. కాంగ్రెసు పార్టీలో బలంగా ఉంటూ తరువాత సైలెంట్‌గానున్న సీనియర్ నాయకులను వైసిపిలోకి తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చనడుస్తోంది. వారు రావడం ద్వారా అధికార టిడిపి కూటమిని గట్టిగా ఎదుర్కొనే బలాన్ని సాధించవచ్చునన్న ఆలోచనలోనూ పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఏది ఏమైనా వైసిపిలో మార్పులు అనివార్యమయ్యే సూచనలు బలంగా కనిపిస్తున్నాయి.

'పురం' మున్సిపాలిటీలో కీలక పోస్టులు ఖాళీ...

టౌన్ ప్లానింగ్‌లో విచిత్ర బదిలీలు

పోస్టు లేని చోటికి ఏసీపీ బదిలీ

పెనుకొండ టిపిఒగా రెహమాన్



హిందూపురం పట్టణ ప్రణాళిక విభాగం గది

ప్రజాశక్తి-హిందూపురం

'రాజు తలచుకుంటే దెబ్బలకు కరువా'అన్నట్లు హిందూపురం పురపాలక సంఘంలో అనుకున్నదే తడవుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో బదిలీలు జరుగుతున్నాయి. కనీసం ఆ స్థాయి పోస్టు ఆ మున్సిపాలిటీలో ఉందా లేదా అన్న ఆలోచన సైతం లేకుండా బదిలీ చేసినట్లు సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా పేరుపొంది ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం మున్సిపాలిటీలో రెండు కీలక పోస్టులు ఖాళీపడ్డాయి. హిందూపురం మున్సిపాలిటీలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా పనిచేస్తున్న సునీల్ ను మడకశిర నగర పంచాయతీకి బదిలీ చేశారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కేవలం సెలక్షన్ గ్రేడ్, కార్పొరేషన్‌లలో మాత్రమే ఉన్న ఏసీపీ పోస్టులకు సంబంధిత హోదా కలిగిన అధికారులు మాత్రమే నియమించాల్సి ఉంటుంది. అయితే కేవలం నగర పంచాయతీగా ఉంటున్న మడకశిరకు హిందూపురం పుర పాలక సంఘంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ కుమార్ ను బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. అదే విధంగా గతంలో ఇక్కడ టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తున్న రెహమాన్ ను మడకశిర నగర పంచాయతీ కు డిప్యూటేషన్ పై పంపడం జరిగింది. అయితే గత 20 రోజుల క్రితం ఆ డిప్యూటేషన్ రద్దు కాగా తిరిగి ఆయన హిందూపురం మున్సిపల్ టిపిఒగా బాధ్యతలు స్వీకరించేందుకు ఇక్కడికి వచ్చారు. కారణాలేమో తెలియదు గాని ఆయన ఇక్కడ జాయిన్ చేసుకోలేదు. దాదాపు 20 రోజుల పాటు కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తే చివరికి ఇటీవలే ఇక్కడ ఆయన టిపిఒగా బాధ్యతలు తీసుకున్నారు. అయితే వెంటనే రెహమాన్‌ను పెనుకొండ నగర పంచాయతీకి డిప్యూటేషన్ పై బదిలీ చేశారు. అప్పట్లో రెహమాన్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేయాలన్న ఉద్దేశంతోనే మడకశిర నగర పంచాయతీకి డిప్యూటేషన్‌పై పంపినట్లు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సెలక్షన్ గ్రేడ్ మున్సిపాలిటీగా గుర్తింపు పొందిన హిందూపురం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండవ అతిపెద్ద పట్టణంగా ఉంది. ఇక్కడ పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులను నియమించకుండానే ఉన్న అధికారులను డిప్యూటేషన్ పై బదిలీ చేయడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. అక్రమ కట్టడాలను గుర్తించేందుకు టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్ర ఎంతో కీలకం. అయితే అవేమీ పట్టించుకోకుండా ఉన్నతాధికారులు ఇలా బదిలీ చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదేమైనా పోస్టులు లేని చోట అధికారులను బదిలీ చేయడం విమర్శలకు దారి తీస్తోంది. అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



గ్రామస్తులతో కలసి ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం పుట్టపర్తి మండలంలోని జగరాజు పల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి ప్రసంగించారు. రాష్ట్రంలోనే శ్రీ సత్య సాయి జిల్లాను పరిశుభ్రమైన జిల్లాగా మొదటి స్థానంలో నిలపాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని సూచించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, నివాసిత ప్రాంతాలు, గ్రామ పంచాయితీలు, మున్సిపాలిటీలు, పాఠశాలలు,ఆసుపత్రులు, బస్టాండ లు, రైల్వేస్టేషన్లు, బజార్లు తదితర ప్రదేశాల్లో స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమం ద్వారా శుభ్రపరచాలని సూచించారు. తడి చెత్త పొడి చెత్తను వేరు చేసి ఎప్పటికప్పుడు గ్రామ పంచాయతీ కార్యాలయం సిబ్బందికి అందజేయాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛ పరిసరాలను అందించే లక్ష్యంతో పని చేయాలన్నారు. ప్లాస్టిక్ ఉపయోగంపై ప్రతీ ఒక్కరికి అవగాహనా ఉండాలని, ప్లాస్టిక్ రహిత జిల్లాను నిర్మించే దిశగా అడుగులు వేయాలని కలెక్టర్ తెలిపారు. ఒక్కో నెల ఒక్కో థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ గావించారు, జగరాజుపల్లి నందు, బీసీ కాలనీ, ఎస్టి కాలనీ, ఎస్సీ కాలనీ నందు పారిశుధ్యం, కాలువలు, తాగునీటి పైపు లైన్లు తదితర అంశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిపిఒ సమత, డిడబ్ల్యూఎం పీడీ విజయేంద్రప్రసాద్, మండల స్పెషల్ ఆఫీసర్, పశుసంవర్ధక శాఖ జెడి శుభ దాస్ , ఎంపీడీవో వెంకటకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనుపమ, సర్పంచి లక్ష్మీ నరసింహ, ఉప సర్పంచి జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధి సర్కిల్‌లో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధి సర్కిల్, మార్కెట్ ప్రాంతాలతో పాటు రహమత్ పురం, ఆహ్మద్ నగర్ తదితర ప్రాంతాలలో కమిషనర్ శ్రీనివాసులతో పాటు టిడిపి నాయకులు రోడ్లను శుభ్రం చేయడంతో పాటు మురుగు కాలువలను శుభ్రం చేశారు. అనంతరం స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ప్రతి పక్షనేత, టిడిపి పట్టణ అధ్యక్షులు డిఈ రమేష్ కుమార్, మున్సిపల్ డీఈ మోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, మంజుళ, మున్సిపల్ ఉద్యోగులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

21న జాతీయ ఎస్సీ కమిషన్ జిల్లా పర్యటన

కలెక్టర్ టిఎస్ చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు జాతు హుస్సేన్ ఈనెల 21న శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ టిఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు జాతు హుస్సేన్ 20న బెంగళూరులో పలు కార్యక్రమాలు లో పాల్గొని 21న అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం కదిరికి చేరుకుంటారన్నారు. కదిరిలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని కదిరి రూరల్ మండలంలో రామదాసు నాయక్ తండా, బోడే నాయక్ తండా సందర్శించి అక్కడ గిరిజనులతో వారి సమస్యలపై చర్చిస్తారన్నారు. ఉదయం 11 గంటలకు అక్కడ నుంచి ముదిగుబ్బ మండలంలోని జొన్నల కొత్తపల్లి తండాను సందర్శిస్తారన్నారు. మధ్యాహ్నం పుట్టపర్తి కలెక్టరేట్లో జరిగే సమావేశంలో కలెక్టర్, ఎస్పీ, ఆర్డీవోలు, బీసీ అధికారులతో గిరిజన సంక్షేమ పథకాలు జిల్లాలో అమలు గురించి సాయంత్రం ఐదు గంటల వరకు సమీక్షిస్తారన్నారు. అనంతరం బుక్కపట్నం మండలంలో నర్సింపల్లి తండాలో పర్యటించి అక్కడ నుంచి తిరిగి బెంగళూరు బయలుదేరి వెళతారని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

కనిపించని సం'క్రాంతి'

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సంక్రాంతి అంటూనే రైతుల పండుగ. పంట చేతికొచ్చిన సమయంలో జరిగే ఈ పండుగ అంటే పల్లెల్లో ఎక్కడ లేని సందడి కనిపిస్తుంది. రాష్ట్రంలో ఇదే సందడి పలు చోట్ల కనిపించింది. ప్రధానంగా కోస్తా ప్రాంతంలో ఈ పండుగ సందడి అంతా..ఇంతా కాదు. నగరాలు, పట్టణాలకు వలసలు వెళ్లిన వారందరూ స్వగ్రామాలకు చేరడంతో ఆ పండుగ సందడి అంబరాన్ని అంటే విధంగా సాగింది. ఇది మీడియా, సోషియల్ మీడియాలోనూ పెద్దఎత్తున కనిపించింది. కోడి పందేలు, రికార్డు డ్యాన్సు ఇలా ఆ సందడి రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనూ చర్చ జరిగే విధంగా చేసింది. కాని అనంతపురం జిల్లాలోని పల్లెల్లో చూస్తే పండుగ రోజు కూడా ఊసురు మనిపించే విధంగా సాగిందని చెప్పవచ్చు. ఈ వారంలో మూడు రోజులు పండుగ జరిగితే ఎక్కడా ఆ సందడి కనిపించలేదు. కేవలం ఇళ్లలోకే పరిమితమై సాగింది. ఆ ప్రాంతాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారందరూ చేరుకుని సందడి చేయగా ఇక్కడ మాత్రం ఉపాధికెళ్లిన వారు కూడా స్వగ్రామాలకు రాలేదు. ఎందుకంటే ఈ ఏడాది పంటలు ఆశించినంత రైతుకు రాలేదు. ఒకవైపు వర్షాభావం...మరోవైపు అధిక వర్షాలు రెండూ కలిపి



రైతుకు నష్టాలనే మిగిల్చాయి. పండిన అరకొర పంటలకు గిట్టుబాటు ధరల్లేక రైతు అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వేరుశనగ, కంది పంట, వరి, పత్తి ఇలా అన్ని పంటలు చేతికొచ్చినా కొనుగోళు జరగలేదు. ప్రభుత్వం కొనుగోలు చేస్తామన్న ప్రకటన చేసి పేర్ల నమోదుకే పరిమితమైంది. ఇక మిరప పంటను కొనే దిక్కేలేదు. పక్క రాష్ట్రమైన కర్నాటకు వెళ్లి అమ్ముకోవాల్సి వస్తోంది. ఇన్ని కష్టాల నడుమ పల్లె పండుగ సందడి గ్రామాల్లో కనిపించలేదు. ఇలా ఈ వారంలో పండుగ సందడి కనిపించకుండానే సాగిపోయింది. ఇక ఈ వారంలో ప్రధానంగా చర్చకొచ్చిన అంశం తాడిపత్రిలో ఒక వ్యక్తితో మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఆడియో లీక్‌కు సంబంధించి. సదరు వ్యక్తి కో ఆపరేటీవ్ బ్యాంకు ఉద్యోగులు, పోలీసుల పట్ల మాట్లాడిన తీరు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. దీనిపై పోలీసులు సైతం నిశితంగా దృష్టి సారించారు. ఇక వన్‌టౌన్‌లో సాఫ్టువేరు ఉద్యోగి పట్ల కానిస్టేబుల్ దురుసుగా వ్యవహరించిన అంశం కూడా చర్చనీయాంశమైంది. సదరు కానిస్టేబుల్‌పై ఎస్పి జగదీశ్ చర్యలు కూడా తీసుకున్నారు. ఇక వైసిపిలో బిసి నేతలు అలజడి రేపుతున్నారు. ప్రధానంగా రాప్తాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మార్పు జరుగుతుందని వస్తున్న ప్రచారం పెద్ద దుమారేమే రేపుతోంది. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిని కాదని హిందూపురం మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌కు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమిస్తారన్న ప్రచారంలో వాస్తవమెంతోగాని రాజకీయంగా మాత్రం పెద్ద చర్చనీయాంశమే అయింది. దీనిపై వారిద్దరుగాని, ఇతర నేతలుగాని పెదవి విప్పనప్పటికీ ఆ పార్టీలో కొన్ని మార్పులు అనివార్యమయ్యే సూచనలుండే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

పుట్టపర్తిలో భూ బకాసురులు


కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు స్వాహా

ధారదత్తం చేస్తున్న రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జానెడు జాగా ఇస్తే గూడు నిర్మించుకుంటామని దరఖాస్తులు చేసుకోవడమే కాదు ఏళ్ల తరబడిగా నిరీక్షిస్తున్నా నిరుపేదలకు సెంటు జాగా ఇవ్వని రెవిన్యూ అధికారులు కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను పెద్దలకు ధారాదత్తం చేస్తున్నారు. ఇలా గత రెండేళ్లుగా కోట్లాది రూపాయల విలువైన భూములు పుట్టపర్తి మునిసిపాలిటీ పరిధిలో స్వాహా చేస్తున్న పట్టించుకునే వారు లేరు. అధికారులు అనుకున్నదే తడవుగా రికార్డుల్లో కూడా ఎటువంటి సమస్య లేకుండా వారికి అప్పనంగా కట్టబెట్టేస్తున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన వారే ఇలా చేస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

పుట్టపర్తిలో నచ్చిన వారి పేరిట ఎంతటి భూమినైనా, ఎలాంటి భూమినైనా ధారాదత్తం చేయడానికి రెవెన్యూ అధికారులు ఏమాత్రం వెనుకాడడం లేదు. పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో కోట్లరూపాయల విలువ చేసే భూమిని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ అధినేత పేరిట 1బి చేయించారు. అది ఇరిగేషన్ కి చెందిన స్థలం అయినా కానీ ఇందులో రెవిన్యూ అధికారులు కుమ్మక్కై ఆయన పేరిట చేయించడానికి సిద్ధమైపోయారు. ఇప్పటికే ఆ సంస్థ యజమాని పేరిట 1బి సైతం ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు ఆ అధినేతతో అంటకాగుతూ ఆ ప్రైవేట్ విద్యాసంస్థకు భూమి కట్టబెట్టేందుకు ఇలా చేశారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పేదలు అడిగితే సెంటు స్థలం కూడ లేదని చెప్పే రెవెన్యూ అధికారులు, ఇప్పుడు ఆ యజమాని పేరిట దాదాపు 2.45 ఎకరాలు 1బి చేయడానికి ఎక్కడ నుంచి వచ్చిందంటూ ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా ఎనుములపల్లిలోని శిల్పారామం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు 64 సెంట్లు ఉండవలసిన ఇరిగేషన్ భూమి కూడా కొందరి పెద్దల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు ఒక సెంటు కూడా కనిపించడం లేదు. ఇరిగేషన్ భూములు పుట్టపర్తి మున్సిపల్ పరిధిలో ఎక్కడికక్కడ ఆక్రమణకు గురి అవుతున్నా, అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు భూ బకాసురులను వదిలి ప్రభుత్వ ఇరిగేషన్ భూముల్లో



చిన్నచిన్న బంకులు ఏర్పాటు చేసుకుని పొట్ట నింపుకుంటున్న పేదలపై జులుం ప్రదర్శిస్తున్నారు. వారిని అక్కడ నుంచి ఖాళీ చేయించేందుకు సిద్ధమయ్యారు. ముప్పు తిప్పలు పెడుతున్నారు. పుట్టపర్తి జిల్లా కేంద్రమైన తర్వాత ఈ భూ బకాసురుల దోపిడీ ఎక్కువైపోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డు శుభ్రం చేస్తున్న ఎంపి పార్థసారధి, కార్మికులు



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి

పరిశుభ్రత పాటిద్దాం : ఎంపి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

మన పరిసరాలను మనమే పరిశుభ్రం చేసుకుందామని ఎంపి బి.కె.పార్థసారధి పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడో శనివారం రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ లో భాగంగా శనివారం ఎంపి అధికారులు, స్థానిక టిడిపి శ్రేణులు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చీపురు చేపట్టి పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్లను శుభ్రం చేశారు. రోడ్డుపైన అనవసరంగా చెత్త వేసి ఆరోగ్యాన్ని పాడు చేసుకోవడం మంచిది కాదన్నారు. అందరూ పరిశుభ్రత పాటించి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ పుట్టపర్తిగా తీర్చిదిద్దుదాం..: ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : నియోజకవర్గాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. వారు అధికారులు, టిడిపి శ్రేణులతో కలిసి స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, చైర్మన్ తుంగ ఓబుళపతి, సిబ్బంది, టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ చైర్మన్ బెస్త చలపతి, పిసి గంగన్న, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు మహమ్మద్ రఫీ, కోనంకి గంగాధర్ నాయుడు, డి.రామకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



సమావేశంలో పాల్గొన్న సిఐటియు నాయకులు, కార్మికులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని యుటిఎఫ్, సిఐటియు నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో శనివారం సిఐటియు నాయకులు జెవి.రమణ అధ్యక్షత తన సిఐటియు, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయ చంద్రా రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు డాక్టర్ ఆదిశేష హాజరై మాట్లాడారు. కార్మిక చట్టాలను అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. అంగన్వాడీలు, ఆశాలు, మున్సి పల్ కార్మికులు, ఆయాలకు కనీస వేతనం అమలు కోసం ఐక్య ఉద్యమాల ద్వారా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు మండల కో కన్వీనర్ టి.అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొగ్గు నాగన్న, పట్టణ కార్యదర్శి జయచంద్ర, దస్తగిరి, శ్రీనివాసులు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు సరస్వతి, ప్రభుత్వ పాఠశాల ఆయాల యూనియన్ నాయకులు నాగవేణి, జయమ్మ, అంగన్వాడీ లీడర్స్ పోతక్క, దీన, ఫాతిమా, చింతమ్మ, మాంచాల దేవి పాల్గొన్నారు.

భూసేకరణపై విజిలెన్స్ అధికారి విచారణ

ప్రజాశక్తి-హిందూపురం



రైతులతో విచారణ చేస్తున్న విజిలెన్స్ సిఐ జమాల్ బాషా

గత ప్రభుత్వం జగనన్న కాలనీల ఏర్పాటు కోసం సేకరించిన భూ సేకరణపై విజిలెన్స్ సిఐ జమాల్ బాషా శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పట్టణ సమీపంలోని కొటిపి, కొట్నూరు సమీపంలో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. దీనికోసం 16 మంది రైతుల నుంచి కొట్నూరు వద్ద 20 ఎకరాలు, కొటిపి వద్ద సుమారు 12 ఎకరాల భూమిని సేకరించారు. అప్పటి ప్రభుత్వం కొటిపి వద్ద సేకరించిన భూమికి ఎకరాకు రూ, 18 లక్షలు, పొట్నూరు వద్ద ఉన్న భూమికి రూ, 30 లక్షలు రైతులకు నష్టపరిహారంగా అందించింది. దీనిపై రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందిందా లేదా అన్న అంశంపై విజిలెన్స్ సిఐ జమాల్ బాషా శనివారం విచారణ చేపట్టారు. ప్రతి రైతును అడిగి వివరాలను తెలుకుని వారి నుంచి సంతకాలు సేకరించారు.

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించి అపోహలను దూరం చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ ఫిరోజ్ బేగం ఆదేశించారు. కుష్టు వ్యాధి నిర్ధారణ సర్వేలో భాగంగా శనివారం స్థానిక పిహెచ్‌సి నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. గణేష్ కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. డిఎంహెచ్ఒ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. డాక్టర్ తిప్పయ్య మాట్లా డుతూ ఈ నెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. డాక్టర్ నివేదిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్‌లో పిల్లలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జోత్స్న, మునిచంద్రిక, డాక్టర్ భవ్య, సిబ్బంది నగేష్, కుమార్‌రెడ్డి, వెంకటరమణలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో అక్రమ మద్యం ఏరులై పారుతోందని, కల్తీ కల్లు విక్రయిస్తున్నట్లు వస్తున్న కథనాలను జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి ఎస్.గోవిందనాయక్, అసిస్టెంట్ ఎక్సైజ్ అధికారి బి.నర్సింహులు శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా రాజీ పడకుండా దాడులు చేసి 306 కేసులు నమోదు చేసి 310 మందిని అరెస్టు చేసి 1740 లీటర్ల కర్నాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా స్థావరాలపై దాడులు చేసి 54 కేసులు నమోదు చేసి 95 లీటర్ల నాటుసారా స్వాధీనంతో పాటు 10,670 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నామన్నారు. హిందూపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో కల్తీ కల్లు విక్రయాలపై ప్రత్యేక దృష్టి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎక్కడైనా బెల్టు షాపులు, మద్యం అక్రమంగా సరఫరా జరుగుతుంటే ప్రజలు తమ దృష్టికి తేవాలని కోరారు.

బదిలీ అధికారిణికి సన్మానం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

తహశీల్దార్ అనుపమ ఉద్యోగోన్నతిపై చిత్తూరు జిల్లా విపత్తుల నిర్వహణ జిల్లా అధికారిగా బదిలీ అయ్యారు. దీంతో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో వీడ్కోలు సభ నిర్వహించి ఆమెను ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ తహశీల్దార్ సేవలను కొనియాడారు. అనంతరం ఆమెను ఆర్డీవో కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు, మండల సర్వేయర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది మనోజ్, మోహన్‌బాబు, డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్, మల్లికార్జున, శివ పాల్గొన్నారు.

బిసి వెల్ఫేర్ డిడిపై విచారణకు పిఎస్‌యు డిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

జిల్లా బిసి సంక్షేమ శాఖ డిడి నిర్మల జ్యోతిపై విచారణ జరిపించాలని పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మంజుల నరేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోనీ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు మీడియాతో మాట్లాడుతూ డిడి వార్డెన్ల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతోందని ఆరోపించారు. పక్కా ఆధారాలు ఉన్నా జిల్లా కలెక్టర్, మంత్రి సవిత ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. డిడిపై తక్షణమే విచారణ చేపట్టి, ఆమెపై చర్యలు తీసుకునేంత వరకూ దశల వారీగా ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పృథ్వీ, పోతలయ్య, మారుతి, మురళి, మనోజ్, చైతన్య పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశపరీక్ష : డిఇఒ

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డిఇఒ కృష్ణప్ప

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సంజయ్ నగర్‌లోని బిఎస్ఆర్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ ప్రవేశపరీక్ష సజావుగా నిర్వహించామని డిఇఒ కృష్ణప్ప తెలిపారు. పరీక్షా కేంద్రాలను డిఇఒ తనిఖీ చేశారు. రెండు కేంద్రాలలో 403 మందికి గానూ 306 మంది హాజరయ్యారన్నారు. రెండు నెలలు తర్వాత ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. ఆయన వెంట పరీక్ష చీఫ్‌లు శైలజ, రామ్‌ప్రసాద్, సీఎల్వోలు నర్సింగరాజు, అనంత పద్మనాభం ఉన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్షలకు బాలుర ఉన్నత పాఠశాలలో 251 మంది విద్యార్థులు, మున్సిపల్ వీవర్స్ కాలనీ స్కూల్‌లో 187, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 191 మంది విద్యార్థులు హాజరయ్యారు.

తెలుగుజాతి గర్వించదగ్గ నాయకుడు ఎన్టీఆర్

వర్ధంతి సభలో ఎంపి, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్



పెనుకొండలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి పార్థసారధి



కదిరిలో రక్తదాన శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కందికుంట

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పట్టణంలోని ఎంపి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎంపి బికె. పార్థసారధి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఎన్టీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచారని, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కేశవయ్య, జివిపి.నాయుడు, రొద్దం నరసింహులు, సుబ్బరత్నమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : తెలుగు జాతి కీర్తిని ప్రపంచానికి చాటిన మహనీయులు ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. టిడిపి కార్యాలయం ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 'కూడు, గూడు, గుడ్డ' నినాదంతో పేదలకు పక్కాగృహాలు, రూ. 2కే కిలో బియ్యం, చీర-దోవతి కార్యక్రమాలు తీసుకొచ్చిన ఘనత ఆయ నదే అన్నారు. కార్యక్రమంలో నాయకులు సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్లు రామాంజనే యులు, విజయ్, శ్రీరామ్‌నాయక్, శ్రీరామ్‌రెడ్డి, జయప్రకాష్, బేకరీ నాయుడు, వెంకటరాముడు, సుబ్రహ్మణ్యం, దామోదర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి టిడిపి జెండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, కప్పలకొండ నారాయణస్వామి, కొత్తపల్లి జయప్రకాష్, నాయకులు శుభచంద్ర, మాల మనోహర్, అంబులెన్స్ రమేష్, గజ్జల వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ఎన్టీఆర్ పనిచేశారని, ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి తెలిపారు. వారు కొత్తచెరువులో ఎన్టీఆర్ విగ్రహానికి గజమాలలు వేసి నివాళులర్పించారు. దుప్పట్లు పంపిణీ చేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు గంగన్న, చలపతి, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, మాణిక్యం బాబా, రమేష్ రెడ్డి, బండ్లపల్లి కిష్టప్ప, లక్ష్మీనారాయణ, బాబా, నాగేంద్ర, నాగేందర్ ప్రసాద్, కాంట్రాక్ట్ లక్ష్మీనారాయణ, శంకర్, పెద్దన్న పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : తెలుగుజాతి ఉన్నంత వరకూ ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా ఉంటుందని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండల కేంద్రమైన రామగిరిలోని టిడిపి కార్యాలయంలో ఆమె ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ పిలుపు మేరకే పరిటాల రవి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. ఎన్టీఆర్ మా కుటుంబానికి ఎంతో అండగా నిలిచారన్నారు. వచ్చే వర్ధంతి లోపు రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

కదిరిలో రక్తదాన శిబిరం

కదిరి అర్బన్ : తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కొనియదారు. ఎమ్మెల్యే ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పివిఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సందర్శించారు. రక్తదాతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి పాఠశాల అధినేత అనిల్ కుమార్ రెడ్డి, పర్వీన్‌బాను, టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, నాయకులు ఖాదర్‌బాదర్ నాగప్ప, బంగారు కృష్ణమూర్తి, కృష్ణమోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



రామగిరిలో ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీత



పుట్టపర్తిలో ఎన్టీఆర్ విగ్రహానికిపూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి, నాయకులు

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రొద్దం



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. అయితే సభ్యులు ఐదుగురి కంటే తక్కువగా ఉండడంతో కోరం లేక సమావేశం ఆలస్యంగా మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. ఉపాధి హామీ పనులపై ఈ నెల 10వ తేదీ ఓపెన్ ఫోరం నిర్వహించగా ఎందుకు ఆహ్వానించలేదని వైసిపి ఎంపిటిసిలు, సర్పంచులు ఎపిఒ అనిల్‌ను నిలదీశారు. స్పందించిన ఎపిఒ టెక్నికల్ అసిస్టెంట్ల ద్వారా సమాచారం తెలిపామన్నారు. ఆయా శాఖల అధికారులు గత 3 నెలలుగా జరిగిన అభివృద్ధి, చేపట్టబోయే పనుల గురించి వివరించారు. తహశీల్దార్ నాగేంద్ర మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నుంచి రొద్దకంపల్లి, రొద్దం, లోచర్ల, పెద్దమంతూరు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభం అవుతుందన్నారు. ఖాళీగా ఉన్న 35 రేషన్‌షాపులకు త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు మాట్లాడుతూ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారంలోపు 30 ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులపై జిఎస్‌టి వేయడం ఏంటని కంబాలపల్లి సర్పంచి మంజు ప్రశ్నించగా ఆ మొత్తాన్ని సరి చేస్తామని ఎంపిడిఒ రామ్‌కుమార్, ఈఒఆర్‌డి హామీ ఇచ్చారు. సమావేశానికి 20 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా కేవలం 10మంది మాత్రమే హాజరు కావడం గమనార్హం. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశంలో ఏవో నివేదిత, విద్యుత్ ఏఈ శ్రీనివాస్ మూర్తి, ఎంపిపి, జడ్పిటిసి పద్మ, సర్పంచులు, ఎంపిటిసి, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో తల్లి మృతి

మాతృత్వానికి దూరమైన ఐదుగురు చిన్నారులు

ప్రజాశక్తి-అగళి



చంద్రమ్మ(ఫైల్‌ఫోటో)



తల్లి మృతదేహం వద్ద రోదిస్తున్న చిన్నారులు

ఉన్నఫళంగా తల్లి గుండెపోటుతో మృతి చెందడంతో ఐదుగురు చిన్నారులు మాతృత్వానికి దూరమయ్యారు. ఈ సంఘటన శనివారం మండలంలోని పి.బ్యాడిగెర గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి మామ దేవన్న తెలిపిన వివరాలు.. దేవరాజు, చంద్రమ్మ(30) భార్యభర్తలు. వారికి నలుగురు కుమార్తెలు మమత, మేఘన, నవ్య, వనిత, కుమారుడు తేజస్ సంతానం. పెద్ద కూతురు మమత ఐదో తరగతి, మేఘన నాల్గో తరగతి చదువుతున్నారు. నవ్య, వనిత, తేజస్ ఇంటి వద్దే ఉంటున్నారు. దేవన్న, ఆయన కుమారుడు దేవరాజు, చంద్రమ్మ, వారి పిల్లలు ఐదుగురూ కలిసి నివాసం ఉంటున్నారు. వారికి రెండెకరాల పొలం ఉంది. అందులోనే పూరిగుడిసె వేసుకుని రెండు ఆవులు పెంచుకుంటూ వాటి ద్వారా వచ్చే పాలతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 6 గంటల సమయంలో దేవరాజు, చంద్రమ్మ ఇద్దరూ కలిసి పొలంలో గేదెల కోసం గడ్డి కోస్తుండగా చంద్రమ్మ ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. పక్కనే ఉన్న భర్త వెళ్లి చూడగా అప్పటికే ఆమె అచేతనంగా పడిపోయింది. దీంతో ఆమె మామ, భర్త, చిన్నారులు బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని దేవన్న కోరాడు. స్థానిక టిడిపి నాయకులు ఫోన్ ద్వారా ఈ విషయాన్ని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు దృష్టికి తీసుకెళ్లగా ఆయన చంద్రమ్మ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

భార్య చేతిలో భర్త హతం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని రహమత్ పురంలో ఓ మహిళ తన ప్రియుడితో కలిసి కట్టుకున్న భర్తను హతమార్చింది. శనివారం చోటు చేసుకున్న ఈఘటనకు సంబంధించిన వివరాలు... రహమత్ పురంలో అల్లా బకాష్, ఆయన భార్య తబస్సుం నివాసం ఉంటున్నారు. అయితే అదే ప్రాంతానికి చెందిన నదీమ్ తో తబస్సుం వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి అల్లాబకాష్ ఇంటివద్ద లేకపోవడంతో తన ప్రియుడు నదీమ్‌తో ఇంట్లో ఉంది. అయితే శనివారం తెల్లవారుజామున అల్లా బకాష్ ఇంటికి వచ్చాడు. దీంతో తమ వివాహేతర సంబంధం ఎక్కడ బయటపడుతుందోనని తబస్సుం, ఆమె ప్రియుడు నదీమ్ కలసి అల్లాబకాష్‌ను హత్య చేసి, అక్కడి నుంచి పరారీ అయ్యారు. శనివారం ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో టూ టౌన్ సిఐ అబ్దుల్ కరీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. హత్యకు పాల్పడిన వారిని త్వరలో అరెస్టు చేస్తామని సిఐ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లో నివాసం ఉంటున్న గుటావుల్లా రామచంద్ర కుమార్తె దీక్షిత(22) కనపడడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. దీక్షిత శనివారం ఉదయం 11 గంటల సమయంలో షాపింగ్‌కి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని, అంతటా వెతికినా ఆచూకీ తెలియలేదని ఆమె తండ్రి తెలిపాడు. పట్టణంలోని సైదాపురం ప్రాంతానికి చెందిన దాసరి అనిల్ కుమార్ దీక్షితతో సన్నిహితంగా ఉండేవాడని, అతడే దీక్షితను తీసుకెళ్లి ఉంటాడని అతడు ఫిర్యాదులో పేర్కొన్నట్లు సిఐ తెలిపారు.

ఎల్ఐసి లక్ష్యాలను కొనసాగించాలి

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు పిలుపు

ప్రజాశక్తి-హిందూపురం

ఎల్ఐసి జాతీయకరణ లక్ష్యాలను కొనసాగించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని ఎల్ఐసి ఉద్యోగుల సంఘం హిందూపూర్ బ్రాంచ్ అధ్యక్షులు యల్. చంద్రకళ, ప్రధాన కార్యదర్శి కె. రమేష్ డిమాండ్ చేశారు. జనవరి 19న ఎల్ఐసి జాతీయకరణ జరిగి 69 సంవత్సరాలు పూర్తవుతుందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే వాటి స్థానంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసి ని ఏర్పాటు చేశారని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ ఎల్ఐసిని బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఆరోగ్యం, బీమా ప్రతి భారతీయుడికి కనీస అవసరాలని హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ భారాన్ని పూర్తిగా తొలగించాలని అన్నారు. ఎల్ఐసికి వెన్నెముకలుగా ఉన్న 14 లక్షల మంది ఏజెంట్ల న్యాయమైన సమస్యలపై వారి సంఘాలతో చర్చించి పరిష్కరించాలని వారు కోరారు. దేశవ్యాప్తంగా సిబ్బంది తగ్గిపోవడంతో పని భారం పెరిగిందని, తక్షణం క్లరికల్, సబ్ స్టాఫ్ రిక్రూట్మెంట్ చేపట్టాలని డిమెండ్ చేశారు. ఎల్ఐసి దేశవ్యాప్తంగా ప్రత్యేక వ్యాపార దినంగా జనవరి 20ని ప్రకటించిందని, ఈ పిలుపును జయప్రదం చేయాలని వారు కోరారు. బీమా రక్షణకు, రాబడికి, సేవలకు, చెల్లింపులకు నికరమైన ప్రభుత్వ హామీ ఉండడం ఎల్ఐసి ప్రత్యేకతలని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

విద్యుత్ ఏఈగా నాగరాజు

ప్రజాశక్తి-అగళి



మండల విద్యుత్ శాఖ ఏఈగా నాగరాజు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఏడాదిగా మండలా నికి ఏఈ లేక రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు చొరవతో హిందూపురం సబ్ ఆఫీస్‌లో ఏఈగా పనిచేస్తున్న నాగరాజు ఇక్కడ బాధ్యతలు చేపట్టారున. నూతన ఏఈ నాగరాజు మాట్లాడుతూ మండలంలో రైతుల కష్టాలను లైన్‌మెన్ల ద్వారా తెలుసుకుంటానన్నారు. ఎమ్మెల్యే సహకారంతో కొత్త కనెక్షన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల కొరత, లో వోల్టేజీ సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. రైతులు కూడా సహకరించాలని కోరారు.



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జాతీయ సబ్ జూనియర్ జూడో పోటీలకు చిగిచెర్ల విద్యార్థులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జాతీయస్థాయి సబ్ జూనియర్ జూడో పోటీలకు మండలంలోని చిగిచెర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం తిమ్మారెడ్డి, పిడి.ప్రతాపరెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ గత డిసెంబర్ 27 నుంచి 29వ తేదీ వరకూ గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఎంపిక పోటీల్లో జయశ్రీ, కావ్యశ్రీ, యశస్విని, యశ్వంత్, విక్రాంత్, అఫ్జల్ మెహరాజ్ బంగారు పతకాలు సాధించారన్నారు. వీరు జనవరి 18 నుంచి 21వ తేదీ వరకూ పూణేలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిని హెచ్‌ఎం, పిడితో పాటు ఉపాధ్యాయులు, ఎస్ఎంసి ఛైర్మన్, సభ్యులు అభినందించారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న మినీ అంగన్వాడీ కార్యకర్త, అంగన్వాడీ సహాయకుల ఖాళీ పోస్టులకు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ రాధిక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఉప్పలపాడు ఇసుక రీచ్ తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలోని ఉప్పలపాడు ఇసుక రీచ్‌ను శనివారం తహశీల్దార్ నారాయణస్వామి తనిఖీ చేశారు. సమీపంలో ఉన్న వంకను పరిశీలించి, బయటి వాహనాలకు ఇసుక లోడ్ చేస్తే చర్యలు తప్పవని కూలీలను హెచ్చరించారు. రీచ్ నిర్వాహకులు వంకలోని ఇసుకను తరలించే ప్రయత్నాలు చేస్తే కేసులు నమోదు చేస్తామని రీచ్ ఇన్‌ఛార్జి రామ్మోహన్‌కు సూచించారు. ప్రతిఒక్కరూ యాప్‌లో బుక్ చేసుకోవాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చింతలపల్లి సహకార సంఘం ఏకగ్రీవం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



చింతలపల్లిలో ప్రజలతో సమావేశమైన డాక్టర్ స్వర్ణలత

మండలంలోని చింతలపల్లి పంచాయతీలోని తిక్కయ్యస్వామి గొర్రెల పెంపకందారుల సహకార సంఘం, వసంతపురం గ్రామ సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయని శనివారం ఎన్నికల అధికారి డాక్టర్ స్వర్ణలత తెలిపారు. అధ్యక్షులుగా పి.మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా ఎస్.మునెప్ప (కాటమయ్య), డైరెక్టర్లుగా బి.నారాయణస్వామి, బి.పెద్దకాటమయ్య, టి.నరసింహులు, పి.నరసింహులు, ఎస్.చిన్న కాటమయ్యలను ఎన్నుకున్నారు. వారు మాట్లాడుతూ గొర్రెల పెంపకందారుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు.



ఎంపికి వినతి పత్రం ఇస్తున్న మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు

ఎంపికి మీటర్ రీడర్ల వినతి

ప్రజాశక్తి-పెనుకొండ

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎంపి బి.కె.పార్థసారధికి వినతిపత్రం అందించారు. యూనియన్ అధ్యక్షులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ రీఛార్జ్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ ఉపాధి కోల్పోతారని, కావున వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎంపి మాట్లాడుతూ మీ సమస్యలపై చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి దస్తగిరి, పెనుకొండ అధ్యక్షులు నరేష్, బాబా ఫకృద్దీన్, శ్రీనివాసులు, శ్రీకాంత్, ఆంజనేయులు, నరేంద్ర, హేమంత్ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఆశయాలను కొనసాగిద్దాం



ధర్మవరంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న పరిటాల శ్రీరామ్, తదితరులు



తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు ఆశయాలను కొనసాగిద్దామని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ 29వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీనగర్‌లో ఉన్న టిడిపి కార్యాలయంలో శ్రీరామ్ ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి గాంధీనగర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులకు పాలు, పండ్లు అందజేశారు. శ్రీరామ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ స్ఫూర్తితోనే రాష్ట్రంలో మళ్లీ టిడిపి జెండా ఎగురవేశామన్నారు.

నంబులపూలకుంట : ప్రపంచ ప్రసిద్ధి గాంచిన మండలంలోని తిమ్మమ్మ మర్రిమాను వద్ద అఖిల భారత్ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు వీరాంజనేయులు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్తమునిరెడ్డి, సర్పంచి విష్ణుమూర్తి, ఎద్దుల నారాయణస్వామి, వెంకటనారాయణ, గంగరాజు, హరినాథ్, రంగారెడ్డి, బాలవీరయ్య, కురమామిడి సర్పంచి సిఎన్ఎ.సుధాకర్ పాల్గొన్నారు. అలాగే నంబులపూలకుంటలో మాజీ సర్పంచి శ్రీరామనాయుడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వంకమద్ది నరసింహులు, సుధాకర్‌రెడ్డి, నాగమల్‌రెడ్డి, వేణుగోపాల్, మనోహర్ పాల్గొన్నారు.

బుక్కపట్నం : టిడిపి మండల కన్వీనర్ మల్లిరెడ్డి, టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, సాకే యశోద, చెన్నకృష్ణ, బాలు, లావణ్యగౌడ్, అక్కులప్ప, సుధీర్, మంజు, వాజిద్ పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు కాకర్ల సురేంద్ర, నెట్టెం రమణ, చల్లా శ్రీనివాసులు, జక్కంపూడి నాగభూషణ, సంగాల సూరి, చిట్రా నాగభూషణ, జూబ్లీహిల్స్ శ్రీరాములు, రామాపురం కేశవ, మందల సదాశివ, వడ్డే బొజ్జప్ప, నారాయణస్వామి, సర్పంచి ప్రభాకర్‌రెడ్డి, ఎంవి.చౌదరి, తరిగోపుల చౌదరి, చిదంబరరెడ్డి, గరిశినపల్లి రవి, బాలాంజనేయులుయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ సర్కిల్‌లో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మడకశిర : మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేయడం జరిగింది. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

గోరంట్ల : మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల టిడిపి నాయ కులు వేర్వేరుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, వేణు రాయల్, జయరామ్, సుబ్బారెడ్డి, చంద్రారెడ్డి, డిష్ శ్రీనివాసులు, నరసింహులు, అజ్మతుల్లా, బాలకృష్ణచౌదరి, రాజారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నిమ్మల చంద్రశేఖర్, హంపయ్య, సుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు సురేష్, వెంకటేష్, సంతోష్, బిజెపి నాయకులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గాండ్లపెంట : టిడిపి మండల కన్వీనర్ సి.కొండయ్య ఆధ్వర్యంలో నాయకులు ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డి.ఆనంద్, అక్రమ్‌బాషా, ఎస్‌వి. సికింద‌ర్, చిన్నోడు, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లచెరువు : స్థానిక బస్టాండ్ కూడలిలో టిడిపి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

అగళి : టిడిపి మండల కన్వీనర్ కుమార్‌స్వామి, జడ్పిటిసి ఉమేష్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుకొండ : టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అన్నా క్యాంటీన్‌లో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, నాయకులు నారాయణస్వామి, కేశవయ్య, వెంకటరమణ, వెంకటరాముడు, శ్రీనివాసులు, రఘువీరాచౌదరి, కోనాపురం నారాయణస్వామి, రామలింగ, జుఫ్రుల్లాఖాన్, లక్ష్మినారాయణరెడ్డి, సూర్యనారాయణ, త్రివేంద్రనాయుడు, బాబుల్‌రెడ్డి, షౌకత్, సుబ్రహ్మణ్యం, బాబిరెడ్డి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ధిలింగప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి.ఆంజనేయులు, తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సిసి.హరి, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, నాయకులు నీరుగంటి చంద్రశేఖర్, కిష్టప్ప, మద్దిలేటి, సూర్యనారాయణ, మోహన్, అనసూయమ్మ, రామంజి పాల్గొన్నారు.

పరిగి : స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పిహెచ్‌సిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ, వెంకటేష్, నాగభూషణం, ప్రవీణ్‌రెడ్డి, డిఎస్ఎల్ శ్రీనివాసులు, కరణం లక్ష్మణరావు, కంకర శ్రీనివాసులు పాల్గొన్నారు.

హిందూపురం : ఎన్టీఆర్ వర్ధంతిని పురంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ సర్కిల్ తారకరామారావు సర్కిల్స్, పాండురంగ నగర్ ఎన్టీఆర్ పార్క్, బెంగళూర్ రోడ్డు సూగురు, మిట్టమీదపల్లి వద్ద ఉన్నా ఎన్టీఆర్ విగ్రహాలు కు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, బంధువులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, పట్టణాధ్యక్షులు డి ఈ రమేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి ఆర్ఎంఎస్ ఫఫీవుల్లా, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ భేవనహళ్లి ఆనంద్, కురవ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, పార్లమెంట్ మీడియా కో ఆర్డినేటర్ చంద్రమోహన్ యాదవ్, కౌన్సిలర్లు రాఘవేంద్ర, మంజుళ దుర్గానవీన్, హరీష్, నాగేంద్ర, నాయకులు అమరనాథ్, ప్రెస్ వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, సుమో సీనా, కురుబ మలికార్జున, మురళి, మోదశివ, పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షులు శివ శంకర్, తెలుగు మహిళలు వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, అరుణమ్మ, గీతమ్మ, గంగమ్మ, ఐటీడీపీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్, శ్రీనివాసులు, అంజాద్, రఫిక్ భాషా, ఫక్రోద్దీన్, షబ్బీర్ తో పాటు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కళాకారుల నివాళి

పట్టణంలోని ఘంటసాల కళామందిరం ఆధ్వర్యంలో కళాకారులు ఎన్టీఆర్ వర్ధంతిని పురష్కరించుకుని పట్టణంలోని ఇందిరా పార్కులో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల కళామందిరం కార్యదర్శి లోకేష్, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి, నరసింహులు, నారాయణ, అంజినరెడ్డి, ఆంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికుల సౌకర్యాలపై సమావేశం

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని స్టేషన్ మాస్టర్ చల్లా నరసింహనాయుడు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ మేనేజర్ కార్యాలయంలో శనివారం స్టేషన్ మేనేజర్ ఆధ్వర్యంలో రైల్వే వినియోగదారుల సలహా సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రయాణికుల సౌకర్యాలపై చర్చించారు. సలహా సంఘం సభ్యులు పలు సూచనలు చేశారు. సమావేశంలో సభ్యులు కాశీవిశ్వనాథ్, కోటి వెంకటేష్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోనుగుంట్ల సూర్యనారాయణ, ముఖ్య ఆరోగ్య పర్యవేక్షకుడు దామోదరమూర్తి , ఎలక్ట్రికల్ ఇంజినీర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ రైల్వే పోలీస్ యాదయ్య, వర్క్స్ ఇంజినీర్ ఉమేష్, చీఫ్ టికెట్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును ప్యాకేజీ గట్టెక్కించలేదు'

ప్రజాశక్తి-మడకశిర

కేంద్రం విశాఖ ఉక్కు కర్మాగారానికి ప్రకటించిన ప్యాకేజీ రూ. 11,440 కోట్లు ఆ పరిశ్రమ ప్రయివేటీకరణ ప్రయత్నాల నుంచి గట్టెక్కించలేదని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఆనంద రంగారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలన్న ప్రధాన డిమాండ్‌పై స్పష్టత ఇవ్వకుండా కేవలం ప్యాకేజీ ప్రకటించడం ప్రజలకు మోసం చేయడమే అన్నారు. ఇకనైనా కేంద్రం యుద్ధ ప్రాతిపదికన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించాలని, కార్మికుల డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

వయోవృద్ధుల సంరక్షణపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీవో సంక్షేమ చట్టం-2007, సంరక్షణ నియమావళి-2011 వివరాలను వారు విశదీకరించారు. అనంతరం సమావేశంలో మాట్లాడిన వారి అనుమానాలను నివత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎవో కతిజూన్ కుప్రా, తదితరులు పాల్గొన్నారు. సదస్సులో డివిజనల్ పరిధిలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఖబరస్థాన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

నల్లచెరువు:మండలంలోని రాగన్నగారిపల్లిలో పూర్వం నుంచి ఉన్న ఖబరస్థాన్ స్థలాన్ని మలక నారాయణప్ప ఆక్రమించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అతడిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ ముసింలు శనివారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన

ధర్మవరం టౌన్ :పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న స్పందన హాస్పిటల్‌లో శనివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని హాస్పిటల్ అధినేతలు డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా తెలిపారు. వారు మాట్లాడుతూ కిమ్స్ సవేరా, స్పందన హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గుండె వైద్య నిపుణులు డాక్టర్ సందీప్ 130 మందికి వైద్య చికిత్సలు చేశారు. గుండె జబ్బు లక్షణలు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సవీరా హాస్పిటల్ మేనేజర్ షేక్షావలి, స్పందన హాస్పిటల్ సిబ్బంది బాబావలి, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశాలకు వంట పాత్రలు వితరణ

సోమందేపల్లి :తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షులు సిసి హరిదాస్ జన్మదినం, ఎన్టీఆర్ వర్ధంతి నేపథ్యంలో శనివారం స్థానిక పిహెచ్‌సికి రూ. 15 వేల విలువ చేసే వంట పాత్రలు అందించారు. కూటమి నాయకులు మాట్లాడుతూ హరిదాస్ సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్యులు ఓంకార్, టిడిపి మండల కన్వీనర్ సిద్ధి లింగప్ప, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ డివి ఆంజనేయులు, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, చంద్రశేఖర్, వెంకటేష్, సూర్యనారాయణ, కిష్టప్ప, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతప్ప, గట్టా మహేంద్ర, రంగన గోపాల్ పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగుల సమాఖ్య బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

రాష్ట్రంలో మాదిగల ఉద్యోగుల సమాఖ్య బలోపేతమే లక్ష్యంగా జిల్లాల్లో పర్యటిస్తామని రాష్ట్ర సమాఖ్య అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు తెలిపారు. పట్టణంలోని సాయి ఆరామంలో శనివారం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మందకృష్ణ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాలకు మాదిగ ఉద్యోగుల సమాఖ్య అండగా నిలుస్తుందన్నారు. మాదిగల వర్గీకరణకు మాలలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ ఎంఈఎఫ్ అదనపు కార్యదర్శి శంకర్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆనంద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లప్పగారి గంగాధర్, నాయకులు మధుసూదన్, శివకుమార్, నాగరాజు, నరసింహులు, ఎస్.రాయుడు, రంగనాథ్, పోతులయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రశాంత జీవితం గడపాలి

ప్రజాశక్తి-రొద్దం

ప్రజలు పల్లెల్లో ప్రశాంత జీవనం గడపాలని ఎస్ఐ నరేంద్ర తెలిపారు. మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్ఐ పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఆవేశాలకు గురికాకుండా సామరస్యంతో సమస్యలు పరిష్కారం చేసుకోవాలన్నారు. అనంతరం సచివాలయంలో పల్లె నిద్ర చేశారు.

ఆసుపత్రి బోర్డు మీటింగ్‌కు ఎంపీకి ఆహ్వానం

ప్రజాశక్తి-గోరంట్ల

గోరంట్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వినోద్‌కుమార్, సిబ్బంది శనివారం పెనుకొండ పట్టణంలో ఎంపి బీకే.పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి ఆసుపత్రిలో నిర్వహించే బోర్డు మీటింగ్‌కు ఆహ్వానించారు. ప్రభుత్వాసుపత్రిలో ఎంపి నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని ఎంపి హామీ ఇచ్చినట్లు వైద్యులు తెలిపారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని రేగాటిపల్లి గ్రామంలో శనివారం కూటమి నాయకులు, అధికారులు సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. జనసేన నాయకులు చిలకం వెంకటరెడ్డి, జయరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రూ. 40 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జయరామిరెడ్డి, బాబురెడ్డి, కొండారెడ్డి, మల్లేష్ పాల్గొన్నారు.